ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఉచిత వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న ఎస్సై రంజిత్

రామాయంపేట, ఫిబ్రవరి 29 : రామాయంపేటలో దుర్గమ్మ బస్తీలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. హైదరాబాద్‌కు చెందిన మల్లారెడ్డి దవాఖాన వైద్యులతో మాజీ వార్డు సభ్యురాలు బసన్నపల్లి జ్యోతి, మల్లేశం కూతురు వైష్ణవి పుట్టినరోజు సందర్భంగా ఈ శిబిరం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎస్సై రంజిత్, మల్లారెడ్డి దవాఖాన వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

'బేటీ బచావో బేటీ పడావో'పై అవగాహన

అవగాహన కల్పిస్తున్న రిసోర్స్‌పర్సన్

నర్సాపూర్, ఫిబ్రవరి 29: మండలంలోని నారాయణపూర్ గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. విద్యార్థులకు సేఫ్ టచ్ ఆన్ సేఫ్ టచ్, బాల్య వివాహాలు, చైల్డ్ లైన్ ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్ల గురించి అవగాహన కల్పించారు. లైఫ్ స్కిల్స్, మెంటల్ హెల్త్‌పై రిసోర్స్‌పర్సన్ సునీతా రాకేశ్ వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మమత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వం న్యాయం చేయాలి

తహసీల్ కార్యాలయంలో ఆందోళన చేస్తున్న అక్కన్నపేట భూబాధితులు

రామాయంపేట, ఫిబ్రవరి 29: మెదక్, ఎల్కతుర్తి రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులు న్యాయం చేయాలని కోరుతూ రామాయంపేట తహసీల్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళనకు దిగారు. అనంతరం అక్కన్నపేటకు చెందిన రైతులు, ఇండ్లు కోల్పోతున్న బాధితులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. తమ భూములు రోడ్డు పక్కనే ఉండడంతో లక్షల రూపాయల విలువ చేస్తాయన్నారు. భూములు కోల్పోతున్న వారికి గుంటకు రూ.21 వేల నుంచి రూ.41 వేలు ఇస్తామని తెలిపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత తక్కువ ధర ఇస్తామనడం సమంజసం కాదన్నారు.

మెదక్ చర్చి అభివృద్ధికి సహకరించాలి

చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్యను సన్మానిస్తున్న మైనంపల్లి హన్మంత్‌రావు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 29: మెదక్ చర్చి నిర్మించి వంద సంవత్సరాలు అవుతున్న సందర్భంగా చర్చి అభివృద్ధికి సహకరించాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావును చర్చి కమిటీ సభ్యులు కోరారు. గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మెదక్ చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య, కమిటీ సభ్యులు గంట సంపత్, ప్రాంక్‌జాన్సన్, శాంసన్‌సందీప్, సువన్‌డగ్లస్ కలిశారు. చర్చి ఉత్సవాలకు ముఖ్యమంత్రి ఆహ్వానించాలని విన్నవించారు. శాంతయ్య, చర్చి కమిటీ సభ్యులను హన్మంత్‌రావు సన్మానించారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్ కలీమొద్దీన్

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 29: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని డీసీసీబీ మేనేజర్ కలీమొద్దిన్ అన్నారు. గురువారం డీసీసీబీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు సైబర్ నేరాలు, బ్యాంకులో పొదుపు అవశ్యకత, అపరిచిత వ్యక్తులకు ఓటీపీ షేర్ చేయడం, అనవసరమైన లింక్స్ ఓపెన్ చేయవద్దని విద్యార్థులకు అవగాహన కల్పించారు. బ్యాంకు సంబంధిత ప్రశ్నోత్తరాల విభాగంలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రవి, ఫీల్డ్ ఆఫీసర్ రాజనర్సింహ హాజరయ్యారు.

విజయసంకల్ప యాత్రకు తరలిన నేతలు

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 29: నారాయణఖేడ్‌లో నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్రకు మండలం నుంచి పార్టీ మండలాధ్యక్షుడు కోనం విఠల్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు గురువారం భారీగా తరలివెళ్లారు. మోదీ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని, ఇండి యా ప్రపంచంలోనే నంబర్‌వన్‌గా గుర్తింపుపొందిందన్నారు.

అంటరానితనాన్ని నిర్మూలించాలి

నిజాంపేట, ఫిబ్రవరి 29: అంటరానితనాన్ని నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని నిజాంపేట ఆర్ఐ గంగాధర్‌గౌడ్ అన్నారు. చల్మెడలో గురువారం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో ఆర్ఐ మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలను కులం పేరిట అగౌరవంగా మాట్లాడినా, వారిపై వివక్ష చూపినా చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

వేలం పాట వాయిదా..

శివ్వంపేట, ఫిబ్రవరి 29: మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన లింబాద్రి రావు రైస్‌మిల్ యజమాని ప్రభుత్వానికి రూ.4 కోట్ల 10లక్షలు బాకీ ఉన్నాడు. ఆ డబ్బు చెల్లించకపోవడంతో గురువారం రెవెన్యూ అధికారులు పట్టా భూమిని వేలం వేయడానికి సిద్ధమయ్యారు. వేలం పాటకు ఎవరూ రాకపోవడంతో సోమవారానికి వాయిదా వేసినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. వేలం పాటలో తహసీల్దార్ శ్రీనివాస్ చారి, డిప్యూటీ తహసీల్దార్ షఫీ, ఆర్ఐ కిషన్, సర్వేయర్ సతీశ్ తదితరులు ఉన్నారు.

సజావుగా పరీక్షలు

- 5,958మందికి 5,704 మంది (96 శాతం) హాజరు
- ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 29: ఇంటర్ ద్వితీయ సంవత్సరం మొదటి పరీక్ష జిల్లాలో గురువారం సజావుగా జరిగింది. విద్యార్థులు సమయానికి ముందే ఆయా పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. జిల్లా వ్యాపంగా 30 పరీక్ష కేంద్రాల్లో 5,958 మందికి 5,704 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ విభాగంలో 5,424 మందికి 5,189 మంది, ఒకేషనల్ విభాగంలో 534 మందికి 515 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 96 శాతం మంది హాజరయ్యారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. జిల్లాలో ఎక్కడా డిబార్‌కు కానీ, మాల్‌ప్రాక్టీస్‌కు గానీ పాల్పడలేదని ఆయన తెలిపారు. జిల్లాలోని కౌడిపల్లి, నర్సాపూర్‌లోని ఐదు పరీక్ష కేంద్రాలు సందర్శించినట్లు సత్యనారాయణ తెలిపారు.

కొల్చారంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మెడికల్ కిట్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రమేశ్

రామాయంపేటలో ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

సజావుగా నిర్వహించాలి : అదనపు కలెక్టర్

కొల్చారం, ఫిబ్రవరి 29: పరీక్షలు రాస్తున్నఅభ్యర్థులకు ఇబ్బందులు కలుగకుండా మౌలిక సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ రమేశ్ అధికారులకు సూచించారు. కొల్చారంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియెట్ పరీక్షా కేంద్రాన్ని గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రమేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లో నిఘా నేత్రాల ఏర్పాటు, పనితీరు, పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, సజావుగా జరిగేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. పరీక్షలు జరుగుతున్న తీరు, విద్యార్థుల హాజరు వివరాలను పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాళ్లు అదనపు కలెక్టరుకు వివరించారు. తహసీల్దార్ మహ్మద్ గఫార్ మియా ఉన్నారు.

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి బండ్ల ఊరేగింపు

స్వామిని దర్శించుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

చేగుంట, ఫిబ్రవరి 29: మండలంలోని బీ-కొండపూర్ సింగరాయుని గుట్ట లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం స్వామికి భక్తిశ్రద్ధలతో ఇంటింటా బండ్ల ఊరేగింపు నిర్వహించారు. కొండపూర్ లక్ష్మీనర్సంహస్వామి జాతరకు చేగుంట, మిరుదొడ్డి, దౌల్తాబాద్ మండలాల ప్రజలు భారీగా వచ్చి మొక్కలు తీర్చుకున్నారన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తుల కోరిక మేరకు స్వామికి గోపురం నిర్మించాలని సంకల్పించారని, తా నుకూడా తోచినంతా సాయం చేస్తానన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కాల్వల ద్వారా సాగు నీరు తెచ్చుకుని రైతులు పంటలు పండించుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు ప్రవీణారాజిరెడ్డి, బాలనర్సు, ఎంపీటీసీ నవీన్, మాజీ ఉప సర్పంచ్ తోట రమేశ్, బుర్గు శ్రీనివాస్‌గుప్తా, ఆలయ అభివృద్ధి మేనేజింగ్ ట్రస్టీ రాయరావు నర్సింగరావు, ప్రసాదచారి, శ్రీనివాస్‌చారి, సుదర్శణాచారి, మాజీ ఎంపీటీసీ అల్లి అంజిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు చేస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దేవాలయం వద్ద బండ్ల ఊరేగింపును ప్రారంభిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు

ఇంటి పన్ను బకాయిలు చెల్లించండి

రామాయంపేట, ఫిబ్రవరి 29 : రామాయంపేట పురపాలకలో ఇంటి పన్ను బకాయిలు ఉన్నవారు 90శాతం మాఫీతో వెంటనే చెల్లించి రసీదు పొందాలని పురపాలిక కమిషనర్ దేవేందర్ తెలిపారు. గురువారం పురపాలికలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జీవో నెంబర్ 101 ప్రకారం కొంత కాలంగా బకాయిలు ఉన్నవారు వన్‌టైమ్ సెటిల్‌మెంటు కింద 90 శాతం మాఫీతో వెంటనే చెల్లించి రసీదు పొందాలన్నారు. పురపాలిక మేనేజర్ శ్రీనివాస్, బిల్ కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా సంకష్టహర చతుర్దశి

రామాయంపేట, ఫిబ్రవరి 29: పట్టణంలోని పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వర స్వామి సన్నిధిలో గురువారం సంకష్టహర చతుర్దశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామిని పూలతో అలంకరించి మంగళహారతులు, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం పూజారి వెంకటరమణాచార్యుల నేతృత్వంలో పూజలు, హోమాలు చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రామాయంపేట, ఫిబ్రవరి 29: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం వస్తుందని యువ జ్యోతి క్లబ్ నిర్వాహకుడు, యోగా మాస్టర్ బొంతల సత్యనారాయణ అన్నారు. గురువారం రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఉచితంగా యోగా క్లాసులు నిర్వహించారు. యోగాతో మానసిక, వివిధ అనారోగ్య సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

జర్నలిజం విభాగంలో జిల్లావాసికి గోల్డ్‌మెడల్

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 29: తెలుగు యూనివర్సిటీ జర్నలిజం విభాగం ఎంఫిల్‌లో 'ప్రొఫెషనల్ చాలెంజెస్ ఆఫ్ రూరల్ రిపోర్టింగ్ ఏ స్టడీ ఆఫ్ రూరల్ రిపోర్టర్స్ ఇన్ తెలంగాణ' అనే అంశంపై కొల్చారం మండలం వరిగుంతం సీతారాంతండాకు చెందిన కమల్ సురేశ్‌కు గవర్నర్ తమిళిసై గురువారం గోల్డ్‌మెడల్ బహుకరించారు. కమల్ సురేశ్ ఇంతకు ముందు పొట్టిశ్రీరాములు వర్సిటీలో గోల్డ్ మెడల్ అందుకున్నారు.

కమల్ సురేశ్‌కు గోల్డ్‌మెడల్ అందజేస్తున్న గవర్నర్ తమిళిసై

ధరణి సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్, ఫిబ్రవరి29 (నమస్తే తెలంగాణ): ధరణి, భూ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 1 నుంచి 9 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో ధరణి, భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూ సంబంధిత 5833 దరఖాస్తులకు మోక్షం లభించనుందన్నారు. 21 మండలాల్లో మూడు బృందాలతో క్షేత్రస్థాయిలో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. ప్రజావాణి రిలేటెడ్ ల్యాండ్ సమస్యలపై ఆర్డీవోకు అధికారాలు ఉన్నాయన్నారు. 5 లక్షల విలువ ఉన్న భూములకు ఆర్డీవో స్థాయిలో అధికారాలు ఉంటాయని, అంతకు మించి లక్ష నుంచి 50 లక్షల వరకు కలెక్టర్ పరిశీలన చేయాల్సి ఉంటుందని, 50 లక్షల నుంచి ఆపై ఉన్న భూ సమస్యలకు సీసీఎల్ఐ దృష్టికి వెళ్తుందని చెప్పారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ స్థాయిలో ఈ మూడు బృందాలు పని చేస్తారని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. సర్వేయర్, గిర్దవార్ పేరా, లీగల్ అసిస్టెంట్, పంచాయతీ సెక్రెటరీ, అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ వీళ్లందరూ ఈ బృందాల్లో ఉంటారన్నారు. సమావేశంలో ఈడీ ఎం.సందీప్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

పల్స్‌పోలియో విజయవంతానికి సహకరించాలి

కొల్చారం, ఫిబ్రవరి 29: రేపటి నుంచి నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని మెడికల్ మండల ఆఫీసర్ రమేశ్ కోరారు. కొల్చారం పీహెచ్‌సీలో ఎంపీపీ మంజుల అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ కొల్చారం పీహెచ్‌సీ పరిధిలో 1930 మంది 0- 5 సంవత్సరాల వయస్సున్న చిన్నారులు పల్స్ పోలియోకు అర్హత కల్గి ఉన్నారన్నారు. పది కేంద్రాల్లో చుక్కల మందు వేయనున్నట్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ మహ్మద్ గఫార్‌మియా, ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు, రంగంపేట మెడికల్ ఆఫీసర్ హర్షిత, విద్యుత్ ఏఈ హైమద్ అలీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొల్చారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్‌పోలియోపై సమీక్షలో పాల్గొన్న ఎంపీపీ మంజుల, మెడికల్ ఆఫీసర్ రమేశ్

ఘనంగా గ్రామ దేవతల విగ్రహప్రతిష్ఠ

మనోహరాబాద్‌లో పూజలు నిర్వహిస్తున్న మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి

మనోహరాబాద్, ఫిబ్రవరి 29: మండల కేంద్రంలో గ్రామ దేవతలు మహంకాళి, పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలకు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి కోరారు. ఎంపీటీసీ లతావెంకట్‌గౌడ్, సంతోష్ కుమార్, నాయకులు ర్యాకల కృష్ణాగౌడ్, భిక్షపతి పాల్గొన్నారు.

చెరువులో పడి మహిళ మృతి

తూప్రాన్, ఫిబ్రవరి 29: చెరువులో పడి మహిళ మృతి చెందిన ఘటన తూప్రాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఎస్సై శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్‌కు చెందిన గజ్జెల గౌరమ్మ, కుమారుడు యాదగిరి, కోడలు సంధ్యారాణి, మనవడు ప్రణయ్‌తో కలిసి ఉంటున్నది. ఈనెల 28న ఉదయం గౌరమ్మ, ఆమె కుమారుడికి మధ్య చిన్న గొడవ జరిగింది. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఆమె బయటకు వెళ్లిపోయింది. దీంతో చుట్టుపక్కల వెతికినా గౌరమ్మ ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం తూప్రాన్ పెద్ద చెరువు కట్టమీద గౌరమ్మ చెప్పులు కనిపించాయి. అనుమానంతో వెళ్లి చూడగా గౌరమ్మ చెరువు నీటిలో తేలి కనిపించింది. యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మీడియా అకాడమి చైర్మన్‌కు సన్మానం

రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని రాష్ట్ర పెరిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ గురువారం హైదరాబాద్‌లోని ప్రెస్ అకాడమిలో సన్మానించారు.

-రామాయంపేట, ఫిబ్రవరి 29

మూడు ఇండ్లల్లో చోరీ

నిజాంపేట, ఫిబ్రవరి 29: మూడు ఇండ్లల్లో దొంగతనం జరిగిన ఘటన నిజాంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట గ్రామానికి చెందిన బత్తుల శివవ్వ ఇంట్లోంచి రూ.10 వేల నగదు, 8 తులల వెండి, కుమ్మరి బాలరాజు ఇంట్లోంచి 10 తుల వెండి, అదే గ్రామానికి చెందిన కిష్టారెడ్డి ఇంట్లోంచి రూ. 9500, 12 తులల వెండి ఆభరణాలు, అద్దతులం బంగారాన్ని దుండగులు దొంగలించారు. వివిధ కారణాలతో బాధితులు బుధవారం తమ ఇండ్లకు తాళం వేసి వేరే గ్రామాలకు వెళ్లడంతో దుండగులు చోరీలకు పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

మోడల్ స్కూల్ దరఖాస్తులకు రేపటి వరకు గడువు

రేగోడ్, ఫిబ్రవరి 29: మోడల్ స్కూల్ దరఖాస్తులకు గడువు ఈ నెల 2తేదీ వరకే నని ప్రిన్సిపాల్ జయప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోని వారు వెబ్‌సైట్‌లో www.telangana ms.cgg.gov.in దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 7న పరీక్ష మోడల్ స్కూల్‌లో పరీక్ష ఉంటుందన్నారు.

రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : సీఐటీయూ

నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

చిలిపిచెడ్, ఫిబ్రవరి 29: మిషన్ భగీరథ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న అజ్జమర్రి గ్రామానికి చెందిన పోచయ్య కుటుంబానికి రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం పోచయ్య మృత దేహానికి నివాళులర్పించారు. ఏడేండ్లుగా మిషన్ భగీరథ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న పోచయ్య ఆర్థిక ఇబ్బందులతో మృతి చెందడంతో అతని భార్యాపిల్లలు దిక్కుతోచని పరిస్థితుల్లో పడ్డారన్నారు. మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆయనతో మాజీ సర్పంచ్ పరశురాంరెడ్డి, బీఆర్‌సీ మేనేజర్ జగపతి, బాబు, నర్సింలు, స్వామి, నవీన్, రాజు, అశోక్, బాబు, సంతోష్, శివలాల్, మల్లేశ్, మాణిక్యం ఉన్నారు.

బైక్ దొంగలిస్తున్న వ్యక్తికి దేహశుద్ధి

రామాయంపేట, ఫిబ్రవరి 29: రామాయంపేటలోని హరిజన కాలనీలో బైకును దొంగిలిస్తుండగా ఒక వ్యక్తిని పట్టుకుని దేహశుద్ధి చేసిన ఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలలోకి వెళితే.. రామాయంపేటలోని హరిజన కాలనీకి చెందిన ఒకరు తన బైకులో పెట్రోల్ అయిపోవడంతో రోడ్డు పక్కన నిలిపి ఇంటికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన ఒకడు బైకును కొద్ది దూరం నడుచుకుంటూ తీసుకెళ్లి స్టార్టు చేస్తున్నాడు. శబ్దం రావడాన్ని గమనించిన కాలనీవాసులు బైకు కిక్‌కొడుతున్న వ్యక్తి వద్దకు చేరి గమనించారు. దీంతో సదరు వ్యక్తి బైకును వదిలేసి పరారయ్యేందుకు యత్నించాడు. కాలనీకి చెందిన వారు అతడిని పట్టుకున్నారు. అప్పటికే అక్కడకు చేరుకున్న కాలనీవాసులు ఆ వ్యక్తికి దేహశుద్ధి చేశారు. అనంతరం రామాయంపేట పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మనోహరాబాద్, ఫిబ్రవరి 29: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఫరీర్‌పేటకు చెందిన జీడిపల్లి సత్యనారాయణరెడ్డి ఎల్క్ట్రీషన్‌గా పని చేస్తున్నాడు. ఉపాధి నిమిత్తం మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌కు కుటుంబంతో సహా వచ్చి ఓ పరిశ్రమలో పని చేస్తున్నాడు. రోజులాగే సాయంత్రం కంపెనీ నుంచి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా బొలెరో వాహనం వెనుక నుంచి ఢీకొన్నది. ఈ ప్రమాదంలో సత్యనారాయణరెడ్డి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

నిజాంపేట, ఫిబ్రవరి 29: డిగ్రీ చదువుతున్న యువతి అదృశ్యమైన ఘటన మండలంలోని చల్మెడలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాకలి నర్సింహులు చిన్న కూతురు సుమలత రామాయంపేటలోని ఛత్రపతి శివాజీ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నది. బుధవారం ఉదయం కాలేజీకి వెళ్తున్నని ఇంట్లో చెప్పి వెళ్లింది. ఇంటికి తిరిగి రాలేదు. దీంతో సుమలత తండ్రి గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319447-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.